శ్రీ రామా!

(ఒక కథ)

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు

౧

"ఓలమ్మోయి! ఓలప్పోయి" యని కేకల నొప్పులచే మూల్గుచు నులకమంచముపైఁ బరచిన ప్రాఁతకంబళిపైఁ జిన్నపీటఁ దల క్రిందఁ బెట్టుకొని ప్రక్కవాటుగఁ బండుకొని యున్న ముసలిమొగపుఁ జంద్రవదన కుడిచీల మండ కమృతాంజనమును రాయుచు రామరావు కాళ్లకడ నున్న చేదత్రాళ్లవరుసపై బొట్టనవ్రేళ్ల మోపి కూరుచుండెను. "అబ్బ! నిమ్మళిమయ్యా యని చెప్పఁగ నంతగట్టిగ రాచెద వేల? మనుష్యుఁడవు కావా? దున్నపోతవా?" యని యావృద్ధవేశ్యామాత రామరావును దిట్టి యెడమపాదముతో నట్టె తన్నెను. సుఖాసీనుఁడు కాకపోవుటచేఁగాఁబోలు హఠాత్తుగ లభించిన పాదతాడనమున నాతఁడు మంచము నుండి క్రిందికిఁ బడిపోయెను. పడుచువాఁడు కావున వెంటనే కందుకమువలెఁ బైకుబికి 'నన్నుఁ దన్నెదవా' యని యాతఁడు ముసలిదానిపైఁ దీండ్రించెను. "ఏమోగోల! దిక్కుమాలినకొంప. ఎండవేళ రవంత సేపు నడుము వ్రాల్చెదనన్న నొక్కటేయల్లరికదా! మీ మొగములు మండ!" యనుచుఁ జవాలున గది తలుపు తెఱచి, యెడమయరచేతి నెండకావునకై చికిలికన్నుల కడ్డముపెట్టుకొని, పైఁట మోచేతిలో వంపువఱకు జాఱి వ్రేలాడ, నిదురమబ్బున వదలిపోయినకచ్చను బ్రక్కబారున వంగి కుడిచేత సర్దుకొనుచు గదిముందరి చిన్నయరుగుమీఁదికి వచ్చి సరసిజాక్షి నిలువఁబడెను. "సరమ్మా! చూచినావఁటె! నీమగఁడు నన్నుఁ గొట్టఁబోవుచున్నాఁ" డని కూఁతుతోఁ దల్లి మొఱపెట్టుకొనెను. "నన్నుఁ దన్నినప్పుడు నేను దానిపైఁ గోపపడుట తప్పా" యని రామరావు తనకు జరిగినపరాభవమును సరసిజాక్షితో విన్నవించుకొనెను. "నేను నిన్నుఁ దన్నితినా? ఒట్టుపెట్టుకొని చెప్పఁగలవా? ఒక్కకొడుకును బెట్టుకొని బ్రదుకుచున్నావు. అడ్డుగోడమీఁది చీట్లపేక నెత్తిపైఁ బెట్టుకొని ప్రమాణముచేయు" మని చంద్రవదన రామరావును గద్దించెను. "అత్తయల్లురపరిహాసములా? ఏడ్చినట్లే యున్నది. నీకు సిగ్గు లేదు. అతనికి సిగ్గు లేదు. తిండికిఁ బూటకూటింటికిఁ బోయినవాఁడవు వెంటనే రాక యింతయాలస్య మేల చేసితివి? ఇంటికిఁ బోయితివికాఁబోలు! నీయిల్లు మాసిపోను! నిన్నెంత నెత్తిమీఁదఁ బెట్టుకొన్నను, నీకింటి దృష్టిమాత్రము చచ్చిననైన వదలదు. నాకే బుద్ధి లేక వలపులాడినై దేవులాడుచున్నాను" అని సరసిజాక్షి రామరావునకు సంసారపరిత్యాగమునుగూర్చి సంక్షేపముగ బోధించి స్ఫోటకపుమచ్చలచే మొక్కజొన్నపొత్తివలె నున్న మొగముపైఁ బీఁచువలె ముంగురులు

వ్రేల గిరుక్కున గదిలోనికిఁ బోయెను. "బ్రాహ్మణుఁడు కాఁడు. ఏమనుకొన్నావో" గాయత్రితోడు. ఇంటికిఁ బోయితి ననుచున్నావా? నాకేమి బుద్ధి లేదను కొన్నావా? అయినయింటివాఁడను గాననుకొన్నావా? అడుగు మంతురసాని నడుగు. ఆసుపత్రికి మీయమ్మకు మాత్రలకొఱకుఁ బోయితినో లేదో. సర్జను గారిబిడ్డ సమర్తాడుటచేత నాతఁ డాలస్యముగ వచ్చినాఁడు. రెండుమాత్రలు తెచ్చి మీయమ్మ కిచ్చితినో లేదో మీయమ్మ నడుగు" మని పలుకుచునే రామరావు గదిలోనికిఁ బోయెను.

సర: నెల కొకరూపాయ నల్లమందు కొఱకు కాముండమొగమునఁ గొట్టరాదా? అది కారాలు మిరియాలు నూఱుట యెందులకు? నీవు దేవులాడుట యెందులకు? నే నిప్పించినాను గానని యాముసలిది నన్నుఁ గోసికొని తినుట యెందులకు?

రామ: ఒకరూపాయ నాకెట్లువచ్చునను కొన్నావు? పదునాలుగెకరాలపొలము నీపేర వ్రాసియిచ్చితినిగదా! ఆసిస్తేదో నీవే వసూలు చేసికొనుచున్నావుగదా! నాతిండిమట్టునకుఁ బూఁటకూటియింటిదానికి నీవే యిచ్చుచున్నావుకదా! నేను రూపాయ నెక్కడనుండి తీసికొనిరాగలను? పేకయాటలో బేస్తుడబ్బులు నాలుగు మిగిలినప్పుడు చుట్టలు కాల్చుచున్నాను. లేనప్పుడు లేనేలేదు.

సర: పదునాలుగెకరాలపొల మని పదే పదే దేవ్రలాడెద వెందులకు! నాపేర వ్రాసియిమ్మని నేను గోరితినా? ఆపొలము క్రిందటిసంవత్సరము పండినదా యేడ్చినదా? టొక్కమని క్రొత్తకాసు పొలమునుండి రాలేదు. వంటపూఁటయమ్మకు నెలకుఁ బండ్రెండురూపాయలు నిత్యవిధిలాగున నిచ్చుకొనుచున్నాను.

రామ: అందులకు నే నేమిచేయవలసినది?

సర: నే నింక బూఁటకూటిసూరమ్మకు నెలముడుపులు కట్టలేను. నీయిష్టమైనయెడల మాతోపాటు రెండుపూఁటల నాల్గుమెతుకులు తినుము.

రామ: అయ్యయ్యో! బ్రాహ్మణత్వము భగ్నమైపోదా?

సర: నీ కిప్పు డుండి యేడ్చినదా?

రామ: ఏఁటేఁట నింటికిఁబోయి తండ్రి తద్దినము పెట్టుచున్నానుగాదా? బ్రాహ్మణత్వమున కంతకంటె నేమినిదర్శనము కావలయు?

సర: పోని! తిండికిఁగూడ మీయింటికే పోవుచుండఁగూడదా?

రామ: నేనుబోను. ఎవరైనఁ జచ్చినప్పుడింటికి వెళ్లవలసినదే కాని యీలోపలఁ బోవనని ప్రతిజ్ఞ చేసికొన్నాను.

సర: మీయమ్మయొద్దఁ గొంతముల్లె యున్నదఁటే?

రామ: ఉన్న వినియోగ మేమి? ఆమె చావఁబోవునప్పు డది కోడలికిచ్చునుగాని నాకీయదు.

సర: చేతగానిపెద్దమ్మవు. ఆమె యిచ్చుట యేమి? నీవు పుచ్చుకొనుట యేమి? నెత్తిపాయఁ గొట్టి యాసొమ్మేదో నీవు తీసికొనరాదా?

రామ: ఆసొమ్మింటియొద్ద నున్నట్లు లేదు. ఎవరికో కాని మాయమ్మ బదు లిచ్చిన

దనుకొందును. నా కాసంగతియేమియుఁ దెలియదు. ఆసొమ్ముపడ్డి పెట్టుకొని కాఁబోలు వారుముగ్గురు గంజిత్రాగుచున్నారు. వారి జోలి నా కక్కఱలేదు; నాజోలి వారి కక్కఱలేదు. ఆలాగున నామనస్సులో నిదివఱకే స్థిరపఱచుకొనియున్నాను.

సర: అటులైన ముందుమాట యేమి ?

రామ: ముందుమాటముష్టి. బ్రాహ్మణునకది తప్పుగాదులే.

సర: చూడు. ముష్టియనఁగా జ్ఞప్తికివచ్చినది. చేబియ్యపుశాస్త్రులుగారి నెఱుఁగుదువా?

రామ: నే నెఱుఁగను.

సర: ఆఁ ! ఎఱుగకేమి ? నల్లగాఁ బొట్టిగా నుండును. మనయూరిలోనికచ్చేరిలోఁ జెట్టుక్రింద వకాల్తిపని చేయుచున్నాఁడే ! ఆయన—

రామ: సరే. ఆయనమాట యేమి ?

సర: ఆయన, యాపలివీథిలోనున్న సిమ్మిసానితో నన్నాఁడఁట-ఏమనియా ?

రామ: ఏమన్నాఁడో తరువాతఁ జెప్పవచ్చును గాని నే నెఱుఁగనిసిమ్మిసాని యెవతె ?

సర: సిమ్మిసాని నెఱుఁగవు ? సీమంతిని. సిమ్మి యని ముద్దుపేరు.

రామ: ఆలాగా ? దానితో వకీలుగారేమన్నారు ?

సర: రామరావు సరసిజాక్షమ్మగారికి వ్రాసియిచ్చినపత్రము చెల్లదు. అది పిత్రార్జితమైనపొలము. మైనరు పెద్దవాఁడైన తరువాత దావా రాక తప్పదని యన్నాఁడఁట.

రామ: నాలుగేండ్లగొట్టికాయ బ్రదుకుట పెద్దవాఁడగుట ఏమో ? ఎక్కడిమాట. గుండ్రాలు కూలిపోవుచున్నవి.

సర: నీనోటివాక్యమున నట్లు జరుగు నెడల బాధయే లేదు. ఒకవేళ బ్రదికి పెద్దవాఁడైనయెడల నెట్లు ?

రామ: అది పేకతోఁ జేరిన వ్యవహారమగునెడల నేనుజెప్పఁగలనుగాని, యది 'లా' తోఁ జేరినసంగతి కాఁబోలు నాకెట్లు తెలియును ? ఆవకీలునే యడుగలేకపోయినావా?

సర: నే నడుగలేదుకాని సిమ్మియే యడిగినది.

రామ: ఏమన్నాఁడు?

సర: ఆపిల్లవాఁడు రామరావుకుఁ బుట్టలేదని యెదురువాదము వచ్చునెడలఁ బత్రము స్థిరపడు నని చెప్పినాఁడఁట.

రామ: ఆవాద మెన్నడు నెగ్గదనుకో. అది యిల్లాలు. అదికాక నాకొడుకునకు నాకు మూఁడుమూర్తులను భేద మేమియు లేదు.

సర: అంతయిల్లాలు-అంతమగనాలు అంత అరుంధతియే యగునెడల నామె నేలవదలితివి?

రామ: నేను నిజముచెప్పుచున్నాను. నీయభినయమును జూచి నేను నీకు వశుఁడనైతిని. అంతకుఁబూర్వ మిల్లు కదలి యెఱుఁగను. కరణముగారి పెండ్లిలో మొదట నీయభినయమును జూచితిని. అప్పటికి నాభార్య కైదవనెల చూలు. అప్పటినుండియు నీయధీనుఁడ నైతిని. సమయము కనిపట్టి తండ్రిగారు కూడఁ జల్లఁగ వెడలిపోయినారు. ఇఁక నేను

న్నది ? ఆడినది యాట పాడినది పాట. నీకుఁ దెలియని యంశమా యేమి?

సర: చూడు రామరావు! నాయభినయ మంతసొగసుగా నున్నదఁటోయి ?

రామ: నీయభినయములో జీవకళ యున్నది. నే నది యేదో తిన్నఁగఁ జెప్పలేకుండ నున్నాను. నీవు కోరచూపభినయించెదవనుకో. ఆచూపక్కడనే నిలిచిపోదు. ఆకోర కోర కొంతదూరమువఱకుఁ బ్రాఁకిపోవును. ఏలూరి సానియభినయమును గూడఁ జూచినాను. అది వట్టిచిట్టకట్టు; నీయభినయములోఁ గల్పన యున్నది. అంతేగాక ఈయుబుకు, ఈయొయ్యారము, ఈరామణీయకము, ఈరాచఠీవి, దాని యభినయమున నెక్కడివి ?

సర: రామరావూ! సానిపలుకులలో సత్యమెక్కడనని లోకమందలి వెఱ్ఱిముండ కొడుకులతోపాటు నీవుకూడ నన్నయెడఁ జెప్పలేనుగాని నీవిద్యారసికతను గ్రహించియే నీకు దక్కితిని. నగలకేమి నాణెములకేమి ? మాన్యములకేమి మళ్లకేమి ? కావలసినది విద్య పనికిమాలిన తనువులు! ఈవేళ పోవు నెడల రేపటికి రెండు. రామరావు సరసిజాక్షికి మగఁడన్నకీర్తి లోకములో నున్నంతకాలము నీకు స్వర్గలోకమే కదా.

రామ: స్వర్గలోకమునకుఁ బోవు నెడల మాత్ర మేమున్నది ? రంభయే కాదా? అది యిచ్చటనే యున్నది కాదా ? ఎండపొడ గదిలోనికి వచ్చుచున్నది. తలుపు వైతునా ?

సర: సరే కాని యావిసనకఱ్ఱ యొక్కసారి పట్టుకో. నీకుఁ గాసికిఁబోయినంతపుణ్యము.

రామ: నాకుఁ గూడ నిద్ర వచ్చుచున్నది. నేనుగూడఁ బండుకొందును.

సర: నీయిష్టము కాని యదేనిద్ర పోయెదవేమో? ఈదినము శనివారమని తెలియునా? పశువులసంతకుఁ బోయి ముఱ్ఱుపాలు తీసికొని రావలయును?

రామరావు సరసిజాక్షియు నిదురించిరి.

౨

"అమ్మా! విూయింటిదొడ్డిలో సీమచిత్రమూల మున్నదా" అని సాన తనముందు పెట్టుకొని మందులసంచి విప్పుచున్న దేండ వీరభద్రుఁడు సీతమ్మ నడిగెను. 'సీమచిత్రమూల మేలాగున నుండునో నేనెఱుఁగ"నని యామె బదులుచెప్పెను. "ఆకుజెముడాకో" యని దేండ్ర ధన్వంతరి యామె నడుగ నే నెఱుఁగనని యామె ప్రత్యుత్తరమిచ్చెను. "అమ్మా! నాల్గు తములపాకులు తెమ్మ"ని తిరుగ నాతఁ డడుగ నామె తల వంచుకొని కొంతసేపటివఱకు ఒక్కమొగము వైచుకొని నిట్టూర్పుపుచ్చి తములపాకులు లేవని యామె చెప్పెను. ఆకులు తెప్పించెదమన్న నడురాత్రి కొట్లు తెఱచి యుండునా? ఉండినను దెచ్చిపెట్టువారెవ్వరు? ఇంటిలో నులకమంచముపై నొక ముసలి యామె శ్లేష్మబాధచే గొండ్రించుచున్నది. ఆమెకు గుండెలురాయుచుఁ బ్రక్కలొత్తుచుఁ గాళ్లు పట్టుచు సీత సకలోపచారములు చేయుచుండెను. త్రైలోక్యచింతామణి రెండుగురి వెందపూసలయెత్తు సీటితో నరుగ దీసిచిన్న గరిటెలోఁ బోసి "అమ్మా! ఇది విూ యత్తగారిగొంతులోఁ బోయు" నిమ

వైద్యుఁ డామెచేతి కిచ్చెను. ఆమె యట్లొనర్చెను. పిమ్మట వాఁకిటిలో వైద్యుఁడు చుట్టఁగాల్చుకొనుచుఁ గూరుచుండెను. కొంతసేపటి కామె కాయాసము తగ్గినట్లుండెను. "అమ్మా! సీతా! సానియింటనుండి నాకొడుకు రాఁడు. నాకుఁ గొడుకవైనను గోడలవైనను నీవే. నాయవసానమును గనిపెట్టియుండుము పంచపాళిలో రుబ్బురోటిక్రిందఁ గొంతధనమున్నది. నాకర్మలకుఁ దగుమాత్రము వినియోగపఱచి శేషించినదాని నెటనైన దాఁచికొని వంశాంకురమైన కుఱ్ఱవానిని బెంచుకొనుచుండుము. నీవు మహోత్తమురాలవు. పుణ్యశీలవు. నీకు భగవంతుఁడు కష్టశాంతిని శీఘ్రముగఁ జేయును. నీవు కంటఁ దడిపెట్టకుము" అని నిమ్మళముగ సీతతో నామెయత్త చెప్పెను. "అత్తా! మీపరిచర్య నాకింక ఋణము లేకపోవునా? మీకుమారుఁ డింటికి రాకున్నను మీ రింటిలోఁ బెద్దదిక్కుగా నుండుటచేతనే నేనును బిల్లవాఁడును బ్రదుకుచున్నాము కాని మీరు లేకున్నయెడల బ్రదుకుటెట్లు? అత్తా! కర్మాధికారియైన కొడుకు మీయవసానమున మీయొద్ద నుండవలయును గాని, నిర్భాగ్యురాలనైన నేనున్న వినియోగమేమి? అదిగాక నాభర్తకు మీ కవసానసేవఁ జేయు పుణ్యము లభింపక పోవునెడల నాయన యుత్తరగతికి భంగకరము కాదా? ఆయన కీసుకృతము దక్కించుటకైన నేను వేశ్యయింటికిఁ బోయి యాయన నిక్కడకుఁ దీసికొనివత్తును. అనుజ్ఞనీయ వేఁడుచున్నాను." అని సీత తన యత్తతో మనవిచేసికొని యేడ్చెను. కనకమ్మ పలుకలేదు. ఒక్కనిమిషము చూచి అత్తా! అత్తా! యని సీత బిగ్గఱగ నఱచెను. పిలుపున కుత్తరము రాకపోవుటచేఁ జప్పున వాఁకిటిలోనికిఁ బోయి వైద్యుని బిలిచెను. అతఁడు చేయి చూచి "నాడిలేదు. గరళము వేయవలసియున్నది. నాల్గురూపాయలిచ్చినయెడలఁ దెల్లవాఱుసరికి దానిని దెచ్చి ప్రయోగించెద నని చెప్పి యాసొమ్ము చేతిలో వేయించుకొని యాతఁడు వెనుకఁజూడకుండఁ బోయెను..

సీతమ్మ "అత్తా! అత్తా! యని తిరుగఁ బిలిచెను. ఆమె పలుకలేదు. ఇంతలోఁ బిల్లవాఁ డీకేకలు విని కాఁబోలు లేచియేడువసాగెను. అతఁడు లేచియుండినయెడల జడిసికొనునేమో యని చప్పున గదిలోనికిఁ బోయి యాతని జోకొట్టుచు నిట్లు యోజించుకొనెను. "ప్రక్కయింటివారి నెవ్వరినైనఁ బిలుతునా? వారెవ్వరైన వచ్చునెడల నాభర్త యీసమయమునఁ గూడ నింట లేకుండుటచే వారాయనను మఱింత దూషింతురేమో? నామూలమున నాభర్త కేల నింద రావలయును? ఇంటిలో బ్రాఁచిపని చేయు దాసిని సహాయురాలిగఁ బిలిచిన మంచిదేమో? పాపము అది మంచిది. వైద్యునిగూడ నదియే పిల్చుకొనివచ్చినది. దానికిఁ బ్రాఁతకోకయిచ్చెదను." అని యూహించుకొని లేచి సమీపముననేయున్న దాసియింటికిఁ బోయి దానితో రెండునిమిషములలోనే తిరుగ నింటికివచ్చెను. దానిని బిల్లవానియొద్దఁ గూరుచుండఁబెట్టి తా నత్తగారి తలవైపునఁ గూరుచుండి నిమ్మ

శముగ నామెచెవిలో నారాయణస్మరణ మొనర్చుచుండెను.........................

ఒడలింక వేఁడిగనే యున్నది. శ్వాసము బాగుగా నాడుచునేయున్నది. గుండెలు తీవ్రముగాఁ గొట్టుకొనుచున్నది. నాభిస్థానమున నెగుపులు బలముగానున్నవి. ఇంటిలో భద్రపఱచిన గంగోదక మామెనోటఁ దనభర్తచేఁ బోయించినఁగాని యామెకుఁ దనభర్తకుఁ గూడ గతు లుండవని నిశ్చయపఱచుకొని లేచి "వెంకీ! ఇటురా! పిల్లవాఁడు నిద్రించుచున్నాఁడు. కావున నీవు మాయత్తగారి మంచముకొద్దఁ గూరుచుండుము. నేనిప్పుడే వచ్చెద"నని చెప్పెను. "అమ్మా! చీఁకటిలో నెక్కడకుఁ బోవుదుర"ని యది ప్రశ్నింప "నాభర్తను దీసికొని వచ్చెద" నని చెప్పి తలుపుతీసికొని వీథిలోనికిఁ బోయెను.

ఆహాహా! సీతమ్మా! ఎంతసాహసము గలదానవు? వేశ్యయింటియొద్ద నున్న భర్తను దెచ్చుటకుఁ జీఁకటిలో నొంటరిగాఁ బోవుచుంటివా? ఆహా! పుణ్యశీలా! నీవొంటరిగాఁ బోవుచున్నావని మేము తెలియక యనుకొనుచున్నాము కాని దేవదూతలు బంటులై నీముందు నడచుచున్నారు. తల్లీ! చీఁకటిలో నీవుపోవుచున్నావని మే మాందోళన మొందుచున్నాముకాని నీపాతివ్రత్యతేజము నీముందు విద్యుద్దీపికవలె నడచుచున్నది. సర్వాభయప్రదాతయగు పరమేశ్వరుఁడు నీహృదయమున నున్నాఁ డనుజ్ఞానము నీకుండగ నీకు భయమేమి? సీతమ్మా! భర్త వేశ్యయింటిలో నుండగ నటకుఁ బోగూడదని యెఱుఁగవా? ఇంటిలోనున్న వెంకినైన నీభర్తకొఱకుఁ బంపలేక పోయితివా? అది పిలిచినయెడల నీభర్త రాకపోవునేమో యని నీవు బయలుదేఱితివా? కానీ, కానీ - ఎందులకు బయలుదేఱితివో బయలుదేఱితివి కదా!......................

అదిగో! ఆదివ్యతేజము భోగమువీథిలోనికి మఱలినది. ఒకయింటిలో నింక దొంతనపు దిబ్బులు వినఁబడుచున్నవి. ఒకయింటి యరుగుమీఁద వేశ్యామాత యడ్డుపొగఁ ద్రాగుచు నుబ్బసపుదగ్గు దగ్గుచున్నది. మఱియొకయింటి యరుగుమీఁదఁ బసవులసంతవారు కాఁబోలు గుఱ్ఱుతీయుచున్నారు. ఆగుఱ్ఱును సుతిగాఁ జేసికొని ప్రక్కదొడ్డిలోని పంది పైస్థాయిని ఘుర్ఘురించుచున్నది. ఈప్రక్కనున్నది విఘ్నేశ్వరాలయమే కాఁబోలు నని సీతమ్మ తనలో ననుకొనునంతలో వెనుక పాడుదొడ్డిలోని చింతచెట్టుపై బండిపులుఁగు "ఊఁ" యని ప్రత్యుత్తరమిచ్చెను. "ఇదివఱకు వినిన ప్రకార మింక రెండిండ్లే కాఁబోలు దాఁటవలయు" నని సీతమ్మ తనమనస్సులో ననుకొనుసరికి తాణాగడియారము టంగుటంగున రెండు కొట్టెను. ఆహాహా! పతివ్రత ప్రశ్నములకుఁ బ్రకృతి ప్రత్యుత్తరమిచ్చును గాఁబోలు!..........................

మూఁడవయింటి గుమ్మములో నామె తలుపుపైఁ జేయివైచి నిలువఁబడెను........

అమ్మా! సీతమ్మా! నీకు గుండె లేమైనఁ గొట్టుకొనుచున్నవా? కాళ్లైన వడఁకుటలేదా? ఆహా! ఎంతశౌర్యసంపన్నురాలవు!......

అత్తగారిసద్గతి నభిలషించి, పనికిమాలినభర్తకుఁ బ్రజానింద కలుగునేమో యను భయముచే నాతపని చేసితివి! అమ్మా! అట్లులికిపడెద వేల ? పిల్లవాఁ డేడ్చినట్లు వినఁబడినదా? వాఁడు నీపిల్లవాఁడు కాఁడమ్మా! ఎదుటియింటిలో నెవ్వరో సంసారు లున్నారు. వారిపిల్లవాఁడమ్మా. భర్త సామీప్యమునఁ బిల్లవానిమాట యట్టె స్ఫురింపఁ గన్నిట్టె చెమ్మగిల్లినదా? అటులైనఁ బిల్లవానిసన్నిధిని వేశ్యయింటిలోనున్న భర్త సంతతము మనస్సునకు రాఁగ నాల్గుసంవత్సరములనుండి యెంత యేడ్చుచున్నావో! నిన్నింత యేడ్పించిన భర్తపై నీకు రవంతకోపమైన లేదా? కాసంత యుడుకుబోతుఁదనమైన లేదా? ఆహా! యాఁడుది యనగ నీవే..............

అమ్మా! వేశ్యగుమ్మములో నిలువఁబడి యట్లూరకుందు వేల ? పాపము! ఊరకుండక యేమిచేయఁగలవు? ఎవరిని బిలుతువు- ఏమని పిలుతువు - తలుపు నిమ్మళముగఁ ద్రోచినయెడలఁ గుక్కయని సందేహింతు రేమో? అదిగో లోపలినుండి వీధిని బడుచున్నమాటల నాలకించుచున్నావా? ఏమని? ఇస్తోకు - మూఁడు దెబ్బలరెండుపాళ్లు బేస్తూ పై బేస్తూ. అమ్మా! నీవు చదువుకొన్న భాగవతాదిగ్రంథములలో నీమాట లెచ్చటనైన వచ్చినవా? వీధితలుపు కొట్టినట్లుండ లోపలినుండి "ఎవరువారు" అను ధ్వని వినఁబడినది. కనకమ్మకోడలి నని చెప్పునా? రామరావుభార్య నని చెప్పునా? సరసిజాక్షిసవతి నని చెప్పునా? "నేను-నేను" అను పలుకు వీధినుండి లోనికిఁబడఁగ "నెవఁడవు నీవు" అని గద్దించుచు రామరావు కఱ్ఱ తీసికొని తలుపులు తెఱచి యీవలకు వచ్చెను. ఎదుటిదీపకాంతిచే సీతమ్మమోము జిగజిగ మెఱసిపోవుచుండెను. భార్యను గుర్తించి రామరావు తెల్లఁబోయి "నీ విప్పు డిచ్చట కేలవచ్చితి" వని హుంకరించెను. "అత్తగారికిఁ బ్రాణముమీఁదికివచ్చినది. మీరు వెంటనేరావలయు" నని భార్య పెదవులు తడుపుకొనుచుఁ జెప్పెను. "నేను వచ్చి బ్రదికింపఁగలనా? పోపో" యని రామరావు లోనికిఁ బోఁబోవుచుండఁగ, నాతని కడ్డువచ్చి "అట్లుకాదు. మీరు లేకుండ మీతల్లిగారు మరణింపఁదగదు. అటులైన నామెయు మీరుకూడ దుర్గతిపా లగుదురు. రాక తప్ప"దని ధైర్యముతో నామె పల్కెను" నీవిచ్చటికివచ్చి నామాట కెదురాడి నన్నల్లరిపెట్టి సానివీధిలో నాపరువు తీసివైచెదవా" యని కఱ్ఱతో నామె ప్రక్కటెముకలలోఁ బొడిచి లోని కాతఁడు పోయెను. "హరిహరీ" యని యామె వీధియరుఁగుపైఁ గూలఁబడెను. భార్యపలికిన యీమాత్రపుమాటకే పరువు పోయినదా? వేశ్య తిట్టినప్పుడు వేశ్యామాత తన్నినప్పుడు పరువు పోలేదా! నీపరువు మంట.................................

"వచ్చినవా రెవ్వరోయి" యని సరసిజాక్షి యడుగ. "మాయమ్మకేమో ప్రాణముమీఁదికి వచ్చినదఁట. నన్నుఁ దీసికొనిపోవుటకు మా యింటిదాసి వచ్చినది." అని రామరావు ప్రత్యుత్తరము చెప్పెను." ఆలాగా? భార్యగారి రాయబారములా? సిగ్గుబిడియములు లేక— ఛీ! మీయమ్మకు నూకాలమ్మకును జబ్బేమి?

నిన్నింటికి లాగుకొనిపోవుట కిది యొకతంత్రము" అని వేశ్యపలుక "నట్లుకాదు. జబ్బుసంగతి నిశ్చయమనియే నా నమ్మిక" మని రామరావు ప్రత్యుత్తరమిచ్చెను. "అటులైనఁ బోలేకపోయినావా? అశుభము శుభ మెఱుఁగకుండ నర్ధరాత్రమున నీవు మానిండుకొంపలో నేడ్చుచుండుము"కని వేశ్య యాతనిని మందలించెను. తెల్లవాఱినపిదపఁ బోవచ్చునని రామరావేదో వంకపెట్టుకొని వీథిలోనికిఁ బోయి భార్య యచ్చట లేకుండుట చూచి రవంత సంతసించి తిరుగ లోనికిఁబోయి పేకమాని పండుకొనెను. హృదయమున నేదియో కాని పీకినట్లుండెను. ఆబాధను బ్రయత్నమున నావలఁ ద్రోచివైచికొని తల్లి మరణింపఁ దనకు లభింపబోవు సొమ్మెంతయుండునో యని యోజించుకొనుచుఁ బండుకొనఁగఁ గొంతసేపటి కాతనికిఁ గలఁత నిద్దుర పట్టెనుగాఁబోలు......................

కొంతసేపు దేకి, కొంత సేపుకుంటి, కొంత సేపు ప్రక్కయెముకలను గట్టిగ నడఁచి పట్టుకొని నిమ్మళముగ నడచి, హరి నామస్మరణ మొనర్చుకొనుచు సీతమ్మ యెటులో



రామరావు తనను పిలిచికొనిపోవుటకై వేశ్యాగృహమునకువచ్చిన భార్యను కొట్టి వెలికి నెట్టుట

యిల్లు చేరి యత్తగారితలవైపున నేడ్చుచుఁగూరుచుండెను. అత్త కొడలివేఁడిమి తగ్గినది. ఎగుపులు తగ్గుచున్నవి. నుదుటిపైఁ జిల్లగింజలంత స్వేదబిందువులు నిలిచియున్నవి. ఇఁక నవసానమగుచున్నదని నిశ్చయపఱచుకొని కాళులుచేతులు గడిగికొని మడిబట్టకట్టుకొని పడమటింటిలోనికిఁ బోయి దేవతార్చనవేదికపై నున్న గంగోదకపాత్రమును దీసికొని యీవలికివచ్చి తుంగచాపఁ బరచి యత్తగారిని బాహువులందు గట్టిగఁబెట్టుకొనినారాయణస్మరణ మొనర్చుచు నెత్తి చాఁపపైఁ జేర్చి తలవైపునఁ గూరుచుండి యామెతలను దొడపై నిడుకొని గంగోదకము నామెపైఁ గొంతచల్లి, యుద్ధరిణెతోఁ గొంత నోటిలోఁ బోయుచుఁ జెవిలో నారాయణ నారాయణ యని స్మరించుచు నుండెను. ఇంతలో గుబ్బుమనుధ్వని వినఁబడెను. పరిశీ



సీతమ్మ అత్తగారికి తులసితీర్థము పోయుట

నున్నయెడల నవి మగవానివి. ఆ మాత్రము నకేమగవాఁడడలియడలి యాసులోఁ గండెవలె నల్లలాడి పోవును. అబ్ధి మధ్యమునఁ బగడపుగుట్ట వలెనాపదల నడుమ నాఁడుది నిశ్చలముగ నిలువఁ బడును గాని

లించిచూడఁగ నది ప్రక్కగదిలోఁ బండుకొని నిద్రించుచున్న వెంకిగుఱ్ఱుకాని మఱియొకటి కాదు. మఱి పదినిముసములలో నత్తగారు దేహమును జాలించిరి......................

అట్టిస్థితిలో నొక్కమగవాఁ డెవ్వఁడైన నిట్లాచరింపఁగలఁడా? ఆహా ఆఁడుదాని ప్రకృతి యనిర్వచనీయముకదా! సంపదలలో సహజ భీరువైన యాఁడుది యాపదలలో నపరమేరువు కాదా! సంసారములలోని కష్టములన్నియుఁ గాంతలమూలముననే యింతవట్టుకైన సహ్యముగాఁ గన్పట్టుచున్నవి. మగవాని ప్రకృతివంటిదే మగువ కున్నయెడల నీప్రపంచ మొక్కపగటిలోఁ బ్రళయ మొందఁ గలదు. నిజముగా సంసారములోని కష్టములన్నియు నాఁడుదానివే. సుఖాభాసము లేమైన టొంకునా? మనుజజన్మ మేదనఁగ మొదట నాఁడుదానిదని చెప్పినపిమ్మట మగవానిమాట చూచుకొనవలసినదే.................

3

ఔర్ధ్వదైహిక క్రియ లాచరించి ఆదివారమున రెండుజాములకు రామరావింటికి వచ్చి ప్రక్కశూలలతో మహాకష్టమున సీతమ్మ వండినయన్నమును దిని పిల్లవానిని గొంతసేపాడించి సాయంకాలమగువఱ కింటిలోనే యుండెను. దీపములు పెట్టినపిమ్మట భార్యాభర్తలిట్లు మాటలాడుకొనుచుండిరి.

రామ: చూడు సీతా! ఒక్కసారి వీధిలోనికిఁ బోవుదునా?

సీత: తిరుగ దానియింటికే పోయెదరా?

రామ: పోయినను మొగముచూపి చక్క వత్తును.

సీత: ఆశౌచముతో నక్కడకుఁ బోవుట తప్పు కాదా?

రామ: నేనెవ్వరినైన ముట్టుకొందునా? నాలుగేండ్లనుండి యలవాటుపడిన స్థలము కావున నిక్కడఁ దోఁపకుండనున్నది.

సీత: అట్లయిన మీయిష్టము. ప్రక్కశూల హెచ్చుగా బాధించుచున్నది. రాత్రి తప్పక వచ్చెదరు కాదా?

రామ: పట్టఁజాలనికోపముచే నట్లుచేసితిని. నాచేతులు కాలిపోను. నేనుదుర్మార్గుఁడను. నన్ను క్షమింపుము. రాత్రి తప్పకవత్తును.

రామరావు వేశ్యయింటికిఁ బోయెను. రాత్రి సీతమ్మకు శూల క్రమముగా హెచ్చిపోయినది. పండ్రెండుగంటలవఱకుఁ జూచి సీతమ్మ వెంకిని వేశ్యయింటికిఁ బంపెను. అది గుమ్మమునొద్ద నెంతయఱచినను వారెవ్వరు పలుకకుంటచే వెంకి తిరుగవచ్చెను. కుంపటిలో నిప్పులు వైచి యాకుంపటి మంచమునొద్దఁ బెట్టి వెంకి యామె ప్రక్క కాచుచుండెను. బాధ యేమియు శాంతింపలేదు. బిడ్డను బ్రక్కను బెట్టుకొని సీత లోలోపల బాధచే నేడ్చుచుండెను.................................

వేశ్యయింటనే రామరావు శయనించెను. కడచినరాత్రి నిద్రలేకపోవుటచేతను బగలాయాసమొంది యుండుటచేతను రామరావునకుఁ దెల్లవాఱువఱకు మెలఁకువ రాలేదు. తెల్లవాఱినపిమ్మట నాతఁడు సరసి క్షిని జూచి యింటికిఁబోయెద నని చెప్పెను.

సర: నీ విప్పు డింటికిఁబోవునెడల మా యమ్మ కాసుపత్రినుండి మం దెవరు తెచ్చి పెట్టెద రనుకొంటివి?

రామ: మఱి యెవ్వరినైనఁ బంపరాదా?

సర: నీవు జీతమిచ్చి పోషించుచున్న బంట్లు మాయింట నెందఱున్నారో యెఱుఁగవా? అయినను నీ విప్పు డింటికిఁబోయి చేయవలసిన దేమున్నది? అయిన దేదో యయినది కాదా? ఇఁకఁ గావలసినది మఱేమున్నది? మం దిక్కడకుఁ దెచ్చి తొమ్మిదిగంటల కింటికిఁ బోవచ్చును.

రామరావు సరేయని వేశ్యమాతచీటి తీసికొని యాసుపత్రికిఁ బోయెను. అక్కడ వెంకిని జూడఁగనే యతని ప్రాణము లెగిరి పోయెను. "ఇక్కడకు వచ్చితి వేల" యని తొందరతో దాని నడిగెను. మీబిడ్డ కుంపటిలోఁ బడి కాలిపోయినాఁడని యామె చెప్పెను. నిలువున విఱుచుకొనిపడి కొంతసేపటికి స్మృతినొంది "ఏఁడీ? నాబిడ్డ యేఁడీ?" యని బిగ్గఱగ నఱచెను. "గదిలో సర్జనుగా రాతనికి మందు రాచుచున్నా"రని వెంకి చెప్పెను. గదిలోనికిఁ బోయి యాతఁడు గోలుగోలున నేడ్వసాగెను. నా బిడ్డను బ్రదికింపుఁడని వైద్యునికాళ్లపైఁ బడెను. బిడ్డ స్మృతిలేక పడియుండెను. ఎడమప్రక్క యంతయుఁ గాలియుండెను. కొంతసేపేడ్చి వెంకియొద్దకువచ్చి "నాభార్య యెట్లున్న"దని దాని నడిగెను. "ఆమెకు శూల హెచ్చిపోయినది. నేను వచ్చుసరికే చాల జబ్బుగా నున్న"దని వెంకి చెప్పఁగ "నికసిక్కడ నెందులకు?" అని నెత్తి గొట్టుకొని యేడ్చి "అయ్యో!



"నాబిడ్డఁడే! నా జానకి రాముఁడే!" యని యఱచి "యిక్కడకుఁ దేలేకపోయితివా" యని యామెతో ననెను. (మోహలో నానున్నది కావున) వైద్యుడు నాకీయనన్నాఁ డని యది బదులు చెప్పెను.

"సీతా! సీతా! మనబిడ్డను జూడవా? మనబిడ్డను జూడవా?"

నాబిడ్డను నేనింటికిఁ దీసికొనిపోదునా?" యని వైద్యు నడిగెను. ఇప్పు డిక్కడనుండి కదల్చుటకు వీలు లేదని యాతఁడు కఠినముగఁ జెప్పెను. అంత బిడ్డయొద్ద వెంకినుంచి గుండెలు గొట్టుకొనుచు నాతఁ డింటికిఁ బరుగెత్తుకొని వచ్చి "సీతా! సీతా" యని యఱచెను. ఆమె పలుకలేదు. ఆమెకుఁ గూడ స్మృతి తప్పెను. ఆమె రెండుపాదములతోఁ దనతలపైఁ గొట్టుకొని 'సీతా సీతా' యని యేడ్చెను.

ఎవ్వరోకొందఱు జనులు వచ్చి విచారించి పోవుచుండిరి. ఇంతలో వెంకి యేడ్చుచు నింటికివచ్చి బిడ్డచనిపోయినాఁడని చెప్పెను. పడిపోయిన రామరావు చివాలున లేచి తూలిపడి "వెంకీ! నీ విచ్చట నుండుము. వాఁడుచచ్చిపోలేదు. నాబిడ్డను నేను దెచ్చుకొందును." అని చెప్పి యొక్కపరుగులో నాసుపత్రికిఁ బోయి పిల్లవానిశవమును జేతులలోఁ బెట్టుకొని యింటికిఁ దెచ్చి మంచమునొద్ద నిలువఁబడి "సీతా! సీతా! మనబిడ్డను జూడవా? మనబిడ్డను జూడవా" యని యిల్లెగిరిపోవ నఱచెను. "వెఱ్ఱివాఁడా! ఇఁక నెక్కడిసీత? అన్నియు నైనవి. శాంతింపు" మని యెవ్వఁడో యచ్చటివారిలో ననెను. "అంతే: అంతే! నాకు సీత లేదా? నాజానకిరాముఁడే నాకు లేఁడా? ఇఁక నే నెందులకు" అని గొఱ్ఱెపొట్టేలు పర్వతమును డీకొనునట్లు గోడపైఁ దలగొట్టుకొని నేలఁగూలెను.

(భారతి - మాసపత్రిక - ఫిబ్రవరి, 1924)